

## అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు.



## వన్యప్రాణులపై పోస్టర్ల ప్రదర్శన

ఆరిలోవ: విశాఖ జూ పార్కులో ఆదివారం వన్యప్రాణి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వన్యప్రాణులపై పోస్టర్ ప్రదర్శించారు.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ సోమ | సహర్ మంగళ |
|---|---|---|
| అనకాపల్లి | 6.08 | 4.59 |
| నర్సీపట్నం | 6.10 | 4.57 |

## న్యూస్‌రీల్

### బాలికపై మేనమామ లైంగిక దాడి

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలంలో ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినిపై (17) వరుసకు మేనమామ అయిన లాలం రామదాసు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు ఇవ్వడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రాంబిల్లి సీఐ సీహెచ్ నరసింగరావు ఆదివారం తెలిపారు. బాలికల వసతిగృహంలో ఇంటర్ చదువుతున్న బాధితురాలికి నిందితుడు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది.

### అధికారులను కోర్టులో నిలబెడతాం

మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య



మాట్లాడుతున్న చైతన్య

నర్సీపట్నం: తప్పుడు కేసులు బనాయించిన అధికారులను కోర్టులో నిలబెడతామని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పి.చైతన్య పేర్కొన్నారు. పోలీసుల అదుపులో ఉన్న అల్లంపల్లి ఈశ్వరరావును ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఈశ్వరరావుపై అధికార పార్టీ నాయకులు కక్ష కట్టి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఈశ్వరరావుపై తప్పుడు కేసులు పెట్టిన పోలీసులను కోర్టు బోనులో నిలబెడతామని హెచ్చరించారు. మాల సామాజిక వర్గం ఈశ్వరరావుకు అండగా ఉంటుందన్నారు. ప్రమాదానికి గురై కోలుకుంటున్న ఈశ్వరరావును కేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఎంఆర్పీఎస్ నాయకుడు ఆరుగుల్ల రాజుబాబు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులు నొక్కేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇదే విధంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

### పవర్ లిఫ్టింగ్‌లో బెస్ట్ మ్యాచ్ రిఫరీగా నాగజ్యోతి



మెమెంటో తీసుకుంటున్న నాగజ్యోతి

రోలుగుంట: పవర్ లిఫ్టింగ్‌లో బెస్ట్ మ్యాచ్ రిఫరీగా పీపీఎం నాగజ్యోతి ఎంపికై ఆదివారం గాజువాకలో మెమెంటో అందుకున్నారు. గతేడాది ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన మ్యాచ్ రిఫరీ పరీక్షల్లో అత్యధికంగా 98 మార్కులు సాధించి పాసయ్యారు. మొదటిసారిగా విశాఖపట్నం పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ పోటీలకు మ్యాచ్ రిఫరీగా ఆమె వ్యవహరించారు. ఈ సందర్భంగా బెస్ట్ మ్యాచ్ రిఫరీగా అద్భుతమైన ప్రతిభను కనబరిచి నిర్వాహకుల నుంచి ప్రశంసలను, మెమెంటోను పొందారు. తమ పాఠశాలకు అన్ని రకాలుగా గుర్తింపు తీసుకొస్తున్నందుకు రోలుగుంట హెచ్ఎం ప్రసాద్‌రావు, సహచర ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

### రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి

రోలుగుంట: రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం జరిగిందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఈరెల్లి చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌లో 29 పథకాలు అమలు చేయాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.35 వేల కోట్లు కేటాయించి వార్డులు అభివృద్ధి చేయాలని డిమాండు చేశారు.

# అడవిలో అడ్డదారి





పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా నిర్మించిన రహదారి

**అటవీ భూముల్లో కాలు పెట్టాలన్నా, ఒక్క అడుగు అటవీ భూమి తీసుకోవాలన్నా సవాలక్ష అనుమతులు కావాలి. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి అనుమతి పొందాలి. కానీ యలమంచిలి సమీపంలో పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో మాత్రం ఇవేమీ లేకుండానే స్థానిక జనసేన, టీడీపీ నేతల అండతో రహదారి నిర్మించుకోవడం కోసం దర్జాగా అక్రమాలకు పాల్పడ్డారు. అటవీ భూముల్లోంచి రియల్ ఎస్టేట్ వెంచర్‌కు దర్జాగా రోడ్డు వేసుకుంటున్నా.. రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ కోసం సమీపంలో ఉన్న శేషుగెడ్డ రిజర్వాయర్‌లో భారీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నా.. ఘనత వహించిన అటవీ, జలవనరుల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది.**

- పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో రెండు కిలోమీటర్ల అక్రమ రహదారి
- ఓ రియల్ వెంచర్‌కు మేలు చేసేందుకు జనసేన, టీడీపీ నేతల బరితెగింపు
- అటవీ భూములకు ఆనుకుని 73 ఎకరాల్లో ఫాంల్యాండ్
- రోడ్డు ఏర్పాటుతో ప్లాట్ల ధరలు అమాంతం రెట్టింపు
- రహదారి వేయడానికి చెట్లు కూల్చివేత.. కాల్వలు, కుంటల పూడ్చివేత
- శేషుగెడ్డ రిజర్వాయర్‌లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు
- వన్యప్రాణుల సంచారంపై తీవ్ర ప్రభావం
- చేష్టలుడిగి చూస్తున్న అటవీ, జలవనరుల శాఖ అధికారులు



ఎలాంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న శేషుగెడ్డ రిజర్వాయర్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు

**యలమంచిలి రూరల్:** యలమంచిలి అటవీ రేంజ్ పరిధిలో పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు ఎంతో చరిత్ర వుంది. ఒకప్పుడు కాకులు దూరని కారడవిగా పేరుండేది. వన్యప్రాణులు స్వేచ్ఛగా విహరిస్తాయి. అటవీ జంతువులు కూడా ఎక్కువగా ఉంటాయి. అటువంటి కీలకమైన రిజర్వ్ ఫారెస్ట్‌పై అక్రమార్కుల కన్నుపడింది. ఈ అటవీ భూములను ఆనుకుని 73 ఎకరాల్లో ఓ బడాబాబుకు చెందిన ఫాంల్యాండ్ ఉంది. ఇక్కడ ఎర్ర చందనం, సిరి గంధంతో పాటు పలు విలువైన చెట్లు పెరుగుతున్నాయి. ఈ భూమిని ప్లాట్లుగా వేసిన బడాబాబు అమ్మకానికి పెట్టాడు. అయితే కోటవురట్ల మండలం పందూరు నుంచి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రియల్ వెంచర్‌లో ప్లాట్ల అమ్మకాలకు కొనుగోలుదారులు ముందుకురావడంలేదు. దీంతో సదరు వ్యాపారి 16వ నెంబరు రహదారి పక్కనున్న యలమంచిలి నుంచి రహదారి ఉంటే ప్లాట్లకు డిమాండ్ ఉంటుందని భావించి అందుకు అనుగుణంగా స్కెచ్ వేశాడు. ఇందుకుగానూ యలమంచిలి మండలం మండలం పెదపల్లి ఫారెస్ట్ నుంచి నేరుగా కోటవురట్ల మండలం పందూరులో వున్న తన రిసార్ట్స్ వద్దకు వచ్చేందుకు అడ్డదారిన అటవీ భూముల్లో తనకు కావల్సిన మార్గాన్ని సుగమం చేసుకున్నాడు.



పెదపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌వైపు రియల్ వెంచర్‌కు కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఇనుప గేటు

**కూటమి నేతల అండతో పక్కా ప్లాన్**

రహదారి వేయాల్సిన మార్గంలో కొంత జిరాయితీ, ప్రభుత్వ భూములు, శేషుగెడ్డ రిజర్వాయర్ గట్టు, కొన్ని గెడ్డలు, చిన్న చిన్న వాగులతో పాటు అటవీ భూములు కూడా ఉన్నాయి. స్థానికంగా ఉన్న జనసేన, టీడీపీ నేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారి మంత్రాంగం నడిపాడు. శేషుగెడ్డ రిజర్వాయర్ పాలకవర్గంతో పాటు కొందరు కూటమి నేతలతో కుమ్మక్కై ఎలాంటి అనుమతులు లేకుండా మంత్రిపాలెం నుంచి శేషుగెడ్డ రిజర్వాయర్ వరకు 20 నుంచి 30 అడుగుల భారీ రహదారి నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం 4 నుంచి 5 అడుగుల ఎత్తులో గ్రావెల్ వేసి చదును చేశారు. ఆ రోడ్డుపై గులకరాళ్లు వేస్తున్నారు. శేషుగెడ్డ రిజర్వాయర్ గట్టు దాటిన తర్వాత ప్రభుత్వ, కొండపోరంబోకు భూముల గుండా పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్ భూముల మీదుగా రియల్ వెంచర్ వరకు గ్రావెల్ రోడ్డు వేశారు. ఇందుకోసం అటవీ భూముల్లో చెట్లు కూల్చి, కాల్వలు, కుంటలు పూడ్చిపెట్టారు. వాస్తవానికి అటవీశాఖ నిబంధనల మేరకు ఎటువంటి అనుమతుల్లేకుండా అటవీ భూముల్లో సంచరించడం, వనాలను నరకడం, వన్యప్రాణులు, అటవీ జంతువులను వేటాడడం నేరం. కానీ ఇక్కడ ఒక రియల్టర్ అటవీభూముల్లో యథేచ్ఛగా వనాలను తొలగించి, అక్కడ నిరంతరం తిరిగే వన్యప్రాణుల సంచారానికి సంకెళ్లు వేస్తున్నాడని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి వేసుకునే మార్గంలో యలమంచిలి అటవీ పరిధి అధికారులు పెట్టిన హెచ్చరిక బోర్డు సైతం కూల్చి పక్కకు తోసేయడం చూస్తే బడాబాబు బరితెగింపు అర్థమవుతుంది.

### పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీ భూముల మీదుగా రోడ్డు వేసిన విషయం నా దృష్టికి వస్తే కిందిస్థాయి సిబ్బంది ద్వారా ఆరా తీశాను. అటవీ భూముల్లోంచి ఎలాంటి రహదారి వేయలేదని చెప్పారు. అయినప్పటికీ పరిశీలించి అటవీ భూముల్లోంచి రహదారి వేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, యలమంచిలి

### రోడ్డు నిర్మాణానికి అనుమతి లేదు

శేషుగెడ్డ రిజర్వాయర్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు, గట్టుపై రహదారి నిర్మాణానికి ఎలాంటి అధికారిక అనుమతి లేదు. ఈ ప్రాంతంలో రైతులందరికీ రాకపోకలు సాగించడానికి ఉపయోగపడుతుందని కొందరు గ్రావెల్ రోడ్డు వేసుకుంటామన్నారు. కానీ కంకర రాళ్లు వేస్తున్న సంగతి తెలీదు. రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలు జరిపిన విషయం నాకు తెలీదు. వెంటనే తనిఖీ చేసి తగు చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, జలవనరుల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్, యలమంచిలి

### శేషుగెడ్డ రిజర్వాయర్‌లో అక్రమ తవ్వకాలు

శేషుగెడ్డ రిజర్వాయర్‌లో అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను తరలించినట్లు స్పష్టంగా ఆధారాలు కనిపిస్తున్నాయి. దర్జాగా యంత్రాలతో తవ్వకాలు జరిపి, భారీ టిప్పర్లతో మట్టి తరలించి రోడ్డు కోసం వినియోగించారు. అయినప్పటికీ ఇదేమీ తమకు తెలీదని యలమంచిలి జలవనరుల శాఖ అధికారులు చెబుతుండడం విశేషం. ప్రస్తుతం చేపడుతున్న అక్రమ, అడ్డ రహదారి నుంచి కేవలం 6 కి.మీ మేర ప్రయాణిస్తే రియల్ వెంచర్ చేరుకునే విధంగా రియల్టర్ మార్కెటింగ్ ప్లాన్ వేయడం విశేషం. ఈ రహదారి నిర్మాణాన్ని నిలువరించకపోతే పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో వున్న అటవీ జంతువులు, వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతుందని, వాటికి షెల్టర్ కరువవుతుందని, వేటగాళ్ల గురికి బలి కావల్సివస్తుందని, మరికొన్ని షెల్టర్ లేక మైదాన ప్రాంతాలకువచ్చి సంచరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



శేషుగెడ్డ రిజర్వాయర్‌లో గ్రావెల్ కోసం అక్రమ తవ్వకాలు చేసిన ప్రాంతం

## వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడికి ఊరట

రిమాండ్ తిరస్కరించిన న్యాయమూర్తి.. బెయిల్ మంజూరు

**నర్సీపట్నం:** వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావుకు ఊరట లభించింది. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన పోలీసులు ఈశ్వరరావును ఆదివారం సాయంత్రం జూనియర్ సివిల్ జడ్జి రోహిత్ ముందు హాజరు పరచగా.. రిమాండ్ ను తిరస్కరించి న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. దీంతో ఈశ్వరరావు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. ఈశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆయనకు అండగా నిలిచారు. శనివారం రాత్రికి రాత్రే స్టేషన్‌కు వెళ్లి పోలీసులను నిలదీశారు. కుటుంబ సభ్యులను కలిసి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. దగ్గరుండి బెయిల్‌కు ఏర్పాట్లు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో ఈశ్వరరావు మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**నర్సీపట్నంలో రాక్షస పాలన**

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావును పోలీసులు ఆదివారం వైద్య పరీక్షల నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ సమయంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ పార్టీ నాయకులతో కలిసి ఆస్పత్రిలో ఈశ్వరరావును పరామర్శించారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి ఈవిధమైన చిల్లర రాజకీయాలకు చేయటం తగదన్నారు. కేవలం స్పీకర్ ఒత్తిడి వల్లనే స్వయంగా డీఎస్పీ రంగంలోకి దిగి ఈశ్వరరావుపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. గణేష్ వెంట మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, సిరసపల్లి నాని, లీగల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ నాయకులు ఉన్నారు.



ఆస్పత్రిలో ఈశ్వరరావును (కుడి) పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

# పట్టం ఎవరికి..!



**నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు**

- ప్రథమ ప్రాధాన్యత ఓటుపైనే అందరి ఆశలు
- గెలుపుపై ధీమాతో అభ్యర్థులు
- మొదటి ప్రాధాన్యత ఓటుతో తేలితే ఫలితం సాయంత్రం 5 గంటల్లోపే
- లేదంటే రాత్రి 9 గంటలు దాటే అవకాశం
- ఉత్కంఠలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులు

| | |
|---|---|
| మొత్తం టేబుల్స్ 20 | కౌంటింగ్ స్టాఫ్ 40 మంది |
| మొత్తం ఓట్లు 22,493 | పోలైన ఓట్లు 20,795 |

| | | |
|---|---|---|
| మొత్తం బ్యాలెట్ బాక్సులు 123 | బరిలో ఉన్న అభ్యర్థులు 10 మంది | లెక్కింపు ప్రారంభం ఉదయం 8 గంటలకు |

**సాక్షి, విశాఖపట్నం:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులు.. ఎన్నికల పరీక్షల్లో 'ఫస్ట్' మార్కు ఎవరికి ఇచ్చారో.. మరికొద్ది గంటల్లోనే తేలనుంది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపునకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ సిద్ధమైంది. 10 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఉపాధ్యాయులు గత నెల 27 బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా సాగే ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు.. బాగా ఆలస్యమయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు తో ఫలితం తేలితే.. సాయంత్రం 5 గంటలకల్లా విజేతను ప్రకటించే అవకాశం ఉంది. లేదంటే.. రాత్రి 9 లేదా 10 గంటలకు ఫలితం డిక్లేర్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ ట్రిపుల్‌ఈ విభాగం భవనంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు లె క్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ సీల్స్ తొలగించి.. బ్యాలె ట్ బాక్సుల్ని హాల్‌లోకి తీసుకొస్తారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించి మొత్తం 123 బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. లెక్కింపు కోసం 20 బల్లలు ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 22,493 మంది ఓటర్లున్నారు. వీరిలో 20,795 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**మూడు దశల్లో ప్రక్రియ ఇలా సాగుతుంది..**

సార్వత్రిక ఎన్నికల కంటే భిన్నంగా లెక్కింపు ప్రక్రియ ఉంటుంది. మొత్తం మూడు దశల్లో జరగనుంది. మొదటి దశలో 123 బాక్సుల్లో ఉన్న ఓట్లను బయటికి తీస్తారు. మొత్తం ఆరు రౌండ్లుగా విభజిస్తారు. తర్వాత దశలో పోలైన ఓట్లను 25 చొప్పున ఒక కట్టగా కడతారు. ఇలా కట్టల్లో వెయ్యి ఓట్లు అయితే వాటిని ఒక డ్రమ్‌లో వేస్తారు. మొత్తం ఓట్లను వివిధ డ్రమ్ముల్లో వెయ్యి చొప్పున వేస్తారు. భోజన విరామం తర్వాత చివరి దశలో పోలైన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. తొలిగా మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో విజేత ఎవరో తేలితే ప్రక్రియ ముగిసినట్లే. తొలి ప్రాధాన్యత ఓటుతో విజేత తేలితే.. సాయంత్రం 5 గంటలకల్లా ఫలితం ప్రకటిస్తారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళ్తే మాత్రం 9 గంటలు దాటే అవకాశం ఉంది. పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు, ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మ, పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీ.. ఎవరికి వారే గెలుపుపై ధీమాతో ఉన్నారు.

### మొదటి ప్రాధాన్యత ఓటుతో గట్టెక్కేనా..

పోలైన ఓట్లలో చెల్లుబాటు అయిన వాటిలో సగాని కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు మొత్తం పోలైన ఓట్లు 20,795 ఓట్లు కాగా.. చెల్లని ఓట్లు 795 ఉంటే.. 20,000 ఓట్లను చెల్లుబాటు ఓట్లుగా పరిగణిస్తారు. చెల్లుబాటు ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు ఎక్కువగా వచ్చినా వారిని విజేతగా ప్రకటిస్తారు. అంటే.. 20 వేల ఓట్లలో 10,001 ఓట్లు తొలి ప్రాధాన్యం ఎవరికి వస్తే.. వారినే విజేతగా నిర్ణయిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో ఏ అభ్యర్థీ ఈ మార్క్‌ను చేరుకోకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తారు. గెలుపు కోటాకు సరిపడినన్ని ఓట్లు ఎవరికైతే వస్తాయో అప్పటి వరకు మిగతా ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా మొదటి ప్రాధాన్యత తర్వాత రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అయితే పోటీ చేసిన అభ్యర్థుల్లో అందరికన్నా మొదటి ప్రాధాన్యత ఓట్లు తక్కువ వచ్చిన అభ్యర్థి నుంచి ఈ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఆరోహణ క్రమంలో అభ్యర్థులు సాధించిన మొదటి ప్రాధాన్యత ఓట్ల జాబితాను తయారు చేస్తారు. ఇలా చివరి అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఎవరికి వేశారనే ఓట్లను లెక్కించి ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తూ వస్తారు. ఇలా కింద నుంచి పై వరకు ఇదే తరహాలో లెక్కించి, ఈ ఓట్లను వారికి కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వెళతారు. ఒకవేళ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ మెజార్టీ ఓట్ల మార్కుకు ఏ అభ్యర్థి చేరకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను గణించి ఆ అభ్యర్థులకు జమ చేస్తారు. అప్పటికీ కాకపోతే నాలుగో ప్రాధాన్యం ఇలా మెజారిటీ మార్కు సంఖ్యను ఏదో ఒక అభ్యర్థి చేరేవరకు ఎలిమినేషన్ ప్రక్రియ అనేది సాగుతుంది. అందుకే అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మొదటి ప్రాధాన్యంతో పాటు ఇతర ప్రాధాన్యత ఓట్లు కూడా చాలా కీలకం అవుతాయి.

## ఎస్‌ఐలుగా ఇద్దరు రైతు బిడ్డలు

- పొన్నవోలు గ్రామం నుంచి ఎంపిక
- శిక్షణ పూర్తి చేసుకోవడంతో విజయనగరంలో పోస్టింగ్

**రావికమతం :** తల్లిదండ్రులు సామాన్య రైతు కూలీలు... చదువంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే... అయినప్పటికీ ఉన్నతాశయంతో చదువుకున్న ఇద్దరు యువకులు తొలి ప్రయత్నంలోనే ఎస్ఐలుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని బాధ్యతలు స్వీకరించారు. వీరిద్దరూ ఒకే గ్రామానికి చెందిన వరసకు బావాబావమరిది కావడం విశేషం. మండలంలోని పొన్నవోలు గ్రామానికి చెందిన పులకంటి నాని, కోరసాల దుర్గా ప్రసాదు మార్చి 1న శిక్షణ పూర్తి చేసుకుని, విజయనగరం జిల్లాలో ట్రైనీ ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టారు. పులకంటి నాని, కోరసాల దుర్గా ప్రసాదు 1వ తరగతి నుంచి 5 వరకు పొన్నవోలు మండల పరిషత్ పాఠశాలలో, 6 నుంచి 10 వరకు మేడివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, ఇంటర్ కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. నాని తల్లిదండ్రులు వరహాలుబాబు, ఈశ్వరమ్మ రైతు కూలీలు. ప్రసాదు తండ్రి అప్పారావు చిన్నతనంలోనే చనిపోగా తల్లి సూర్యలక్ష్మి రెక్కల కష్టంతో చదివించింది. చిన్నతనం నుంచి ఎస్ఐ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగిన నాని, ప్రసాదు 2023 డిసెంబర్‌లో జరిగిన ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. 2024 ఫిబ్రవరిలో వెలువడిన ఫలితాల్లో ఎంపికై 52 వారాలపాటు అనంతపురంలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. మార్చి 1న శిక్షణ పూర్తయ్యాక అనంతపురంలో నిర్వహించిన వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. హోం మంత్రి అనిత చేతుల మీదుగా సరిఫికెట్లు తీసుకున్నారు. వీరిద్దరికీ గ్రామస్తులు, సర్పంచ్ అభినందనలు తెలియజేశారు.



చెల్లి, బావతో కోరసాల దుర్గా ప్రసాదు



తల్లిదండ్రులు వరహాలుబాబు, ఈశ్వరమ్మతో పులకంటి నాని

## క్లుప్తంగా

### ప్రేమ వంచన బాధితురాలికి న్యాయం చేయాలి

• మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



దీక్ష శిబిరాన్ని సందర్శించి బాధితురాలితో మాట్లాడుతున్న ధర్మశ్రీ

**చోడవరం:** ప్రేమ పేరుతో నమ్మక ద్రోహానికి గురైన మహిళకు తగిన న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ డిమాండ్ చేశారు. గాంధీ గ్రామానికి చెందిన మొల్లి నూకరత్నంతో చోడవరం కోఆపరేటివ్ కాలనీకి చెందిన కొమ్మోజి సతీష్ కొంతకాలంగా సహజీవనం చేస్తూ ఒక బిడ్డకు తల్లిని చేశాడు. తీరా పెళ్లి చేసుకోమని ఆమె ఒత్తిడి చేయడంతో అతడు మొహం చాటేశాడు. దాంతో తనకు న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ముందు బిడ్డతో సహా బాధితురాలు దీక్ష చేపట్టింది. దీక్షా శిబిరాన్ని ధర్మశ్రీ సందర్శించి ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తక్షణమే న్యాయం చేయాలన్నారు. జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, గాంధీ గ్రామం సర్పంచ్ గాడి అప్పారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య పాల్గొన్నారు.

### చలో విజయవాడను విజయవంతం చేయండి



వీవోఏలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు రూపాదేవి

**నర్సీపట్నం:** వీవోఏల సమస్యలపై ఈ నెల 11న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్.రూపాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలోని క్లస్టర్ సమావేశంలో వీవోఏలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో వీవోఏలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రద్దు చేసిన గ్రేడింగ్ విధానం పునరుద్ధరణ, మగవారిని తొలగించాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. విజయవాడ ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, క్లస్టర్ నాయకులు త్రినాథ్, బుజ్జి, వెంకటలక్ష్మి, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

# హార్బర్‌కు హంగులు







చేపలు ఎండబెట్టుకునే యార్డు, నిల్వ చేసుకునే గదులు, క్యాంటీన్ నిర్మాణ పనులు





చురుగ్గా ఫిషింగ్ హార్బర్ మోడ్రనైజేషన్ పనులు

తాజాగా మరో 2 ఫిషింగ్ జెట్టీల నిర్మాణానికి శ్రీకారం

రూ.32.61 కోట్లతో జెట్టీలతో పాటు వార్ఫ్ నిర్మాణ పనులు అప్పగింత

ఏడాదిలోగా నిర్మించేలా కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం

**సాక్షి, విశాఖపట్నం:** ఆశల తీరంలో బతుకు నావలో బిక్కుబిక్కుమంటూ జీవనం వెళ్లదీసే గంగపుత్రుల జీవితాలకు దారి చూపించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో విశాఖపట్నం పోర్టు అథారిటీ హార్బర్ ఆధునికీకరణ పనులు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం సాగరమాల పథకంలో భాగంగా.. రూ.151.81 కోట్లతో పనులు జోరుగా సాగుతున్నాయి. దళారుల చేతిలో మోసపోతూ.. ఆర్థికంగా ఎదగలేకపోతున్న మత్స్యకారులకు లాభాలు అందించేలా ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ జరుగుతోంది. ఇప్పటికే పలు పనులు చివరి దశకు చేరుకోగా.. తాజాగా మరో రెండు ఫిషింగ్ జెట్టీల నిర్మాణానికి పోర్టు శ్రీకారం చుట్టింది. రూ.32.61 కోట్లతో జెట్టీల నిర్మాణ పనులను ఖరారు చేసింది. ఏడాదిలోగా నిర్మించి.. మత్స్యకారులకు లబ్ధి చేకూరేలా జెట్టీల ఏర్పాటుకు చకచకగా అడుగులు పడుతున్నాయి.

రెండేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం రూ.151.81 కోట్లు వెచ్చించేందుకు విశాఖపట్నం పోర్టు ముందుకువచ్చింది. అందులో రూ.50 కోట్లు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మంజూరు చేశారు. మరో రూ.50 కోట్లు సాగరమాల కింద కేంద్ర నౌకాయానశాఖ ఇచ్చింది. పీపీపీ ప్రాజెక్టుల ద్వారా రూ.27.55 కోట్లు సమకూర్చుకోనున్నారు. విశాఖపట్నం పోర్టు తొలుత రూ.24.26 కోట్లు ఇస్తామని ప్రకటించింది. అయితే మత్స్యకారులు వసతులు పెంచాలని, ఫింగర్ జెట్టీలు కావాలని, వలలు అల్లుకోవడానికి భవనం నిర్మించాలని డిమాండ్ చేయడంతో మరో రూ.26.7 కోట్లు సమకూర్చడానికి విశాఖపట్నం పోర్టు ముందుకువచ్చింది. దీంతో పోర్టు వాటా రూ.50.96 కోట్లకు చేరింది. మత్స్యకారులకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చేలా హార్బర్ అభివృద్ధి జరగాలంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించడంతో 2023లో డీపీఆర్‌లో స్వల్పమార్పులు చేపట్టారు. ముందుగా ప్రతిపాదించిన 3,4,5 జెట్టీలకు బదులు జీరో జెట్టీకి సమాంతరంగా ఫ్లోటింగ్ జెట్టీని నిర్మించాలని, అదేవిధంగా చేపల వేలం, ప్యాకింగ్ ప్రాంతాల్లో కట్టడాల్ని తొలగించి.. మరో జెట్టీని ఏర్పాటు చేసేలా డీపీఆర్‌లో మార్పులు చేపట్టారు. దానికనుగుణంగా తాజాగా నిర్మాణ ప్రక్రియకు అడుగులు పడుతున్నాయి.







ఇక్కడే రెండు ఫిషింగ్ జెట్టీలు రాబోతున్నాయి

#### రూ.32.61 కోట్లతో రెండు జెట్టీల నిర్మాణం

ఇటీవలే ఫిషింగ్ జెట్టీల నిర్మాణానికి విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) టెండర్లు దాఖలు చేసింది. ఈ టెండర్లను ఆర్‌కేఈసీ ప్రాజెక్టు లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. రూ.32,61,42,763తో రెండు ఫిషింగ్ జెట్టీల నిర్మాణంతో పాటు వార్ఫ్ కూడా నిర్మించేలా టెండర్లు ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న ఫింగర్ జెట్టీల మధ్యలో అంటే.. నాలుగో నంబరు జెట్టీ నుంచి 11వ నంబరు జెట్టీ వరకు వార్ఫ్ నిర్మాణం జరగనుంది. చేపల లోడింగ్, అన్‌లోడింగ్‌కు అనుగుణంగా ఈ వార్ఫ్ ఏర్పాటు కానుంది. అదేవిధంగా ప్రస్తుతం హార్బర్‌లో 11 ఫిషింగ్ జెట్టీలున్నాయి. 10 జెట్టీలు మత్స్యకారులు వినియోగిస్తుండగా.. చివరిదైన 11వ జెట్టీని కోస్ట్‌గార్డ్‌తో పాటు మత్స్యకారులు సంయుక్తంగా వినియోగిస్తున్నారు. ఇప్పుడు ఈ జెట్టీ పక్కన మరో రెండు నిర్మాణం కానున్నాయి. ఏడాదిలోపు నిర్మాణం పూర్తి చేసేలా నిబంధనలు విధిస్తూ పనుల్ని ఆర్‌కేఈసీ సంస్థకు అప్పగించారు. ఈ రెండూ అందుబాటులోకి వస్తే.. 11వ జెట్టీని పూర్తిగా కోస్ట్‌గార్డ్ వినియోగించుకుంటుంది. మత్స్యకారులు మాత్రం 12 జెట్టీలను వాడుకునే అవకాశం లభిస్తుంది.

**సకల సౌకర్యాల హార్బర్**

డిమాండ్‌కు అనుగుణంగా వసతుల కల్పనే హార్బర్ ఆధునికీకరణ ప్రధాన ధ్యేయంగా పనులు సాగుతున్నాయి. వేలం హాల్లు, ప్యాకింగ్ యూనిట్, పార్కింగ్ ఏరియా, ఆఫీసుకు ప్రత్యేక సదుపాయం, రెస్ట్ రూమ్, క్యాంటీన్, చేపలు ఎండబెట్టుకోవడానికి పరిశుభ్రమైన యార్డులు, చేపలు నిల్వ చేసుకునే సదుపాయం, ఫ్లోటింగ్ జెట్టీలు, వాటికి రిటైనింగ్ గోడలు, మురుగునీటిని శుద్ధిచేసే ప్లాంటు, అంతర్గత రహదారులు, అండర్ గ్రౌండ్ రిజర్వాయర్, ఓవర్ హెడ్ ట్యాంక్, సోలార్ విద్యుద్దీపాల ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయి. పనులన్నింటిని ఏడు దశలుగా విడదీసి వర్క్ ఆర్డర్లు అప్పగించారు. అదనంగా మరో వేలం హాలు నిర్మించనున్నారు. కొత్త వేలం హాలును ఏసీ సదుపాయంతో ఏర్పాటు చేసేలా నిర్మాణం సాగుతోంది. బోట్ల నుంచి దించిన చేపలు, రొయ్యలను వేలం హాల్లకు కన్వేయరు బెల్టుల ద్వారా పంపే ఏర్పాట్లు రానున్నాయి. దించి,ఎత్తడం వల్ల సముద్ర ఉత్పత్తులు పాడైపోకుండా ఈ సదుపాయం కల్పిస్తున్నారు. పోర్టుకు చెందిన 10 ఎకరాల స్థలంలో కోల్డ్ స్టోరేజ్ రాబోతోంది. దీన్ని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో.. నిర్ణీత ధరలతో నిర్వహించేలా నిర్మించాలని పోర్టు అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్ వద్ద ప్రైవేట్ ప్రాసెసింగ్ ప్లాంట్స్ ఉన్నాయి. ఈ ప్రైవేట్ వ్యాపారులు నిర్ణయించిన ధరలకే అమ్ముకోవాల్సి వస్తోంది. అందుకే.. ప్రత్యేకంగా ప్రాసెసింగ్ ప్లాంట్ కూడా రాబోతోంది. బోట్లు మరమ్మతులు చేసుకునేందుకు ప్రత్యేక రిపేరింగ్ సెంటర్ కూడా నిర్మించనున్నారు. ప్రస్తుతం 24 హెక్టార్లలో ఉన్న ఫిషింగ్ హార్బర్‌లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తు ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా మోడ్రనైజేషన్ హార్బర్‌గా త్వరలోనే మారనుందని పోర్టు అధికారులు చెబుతున్నారు.

## ప్రైవేటీకరణ కుట్రతోనే పదే పదే క్రషింగ్‌కు అంతరాయం

మండిపడిన భారత కమ్యూనిస్టు పార్టీ

**చోడవరం రూరల్:** గోవాడ గ్రామంలోని చోడవరం సుగర్ ఫ్యాక్టరీ ప్రస్తుత క్రషింగ్ సీజన్ ప్రారంభించి పట్టుమని నెలరోజులు కూడా గడవకుండానే 30 సార్లు నిలిచిపోవడం పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ కన్నెర్ర చేసింది. ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడానికి మేనేజింగ్ డైరెక్టర్ ప్రైవేటు వ్యక్తులతో కలసి పన్నిన పన్నాగమని ఆ పార్టీ అనుబంధ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతాంగం, కార్మికుల కుటుంబాలు ఫ్యాక్టరీని నమ్ముకుని జీవిస్తున్నాయని, వారిని నట్టేట ముంచే పనిచేయకుండా సజావుగా క్రషింగ్ సాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతి చిన్న చిన్న విషయానికి క్రషింగ్ నిలిపేయడం ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై చేస్తున్న కుట్రగా అనుమానించాల్సి వస్తుందని హెచ్చరించారు. క్రషింగ్ నిలిచిపోవడంతో రైతులు, పశువులు, ట్రాక్టర్, లారీ సిబ్బంది అనేక ఇబ్బందుల పాలవుతున్న సంగతిని, ఫ్యాక్టరీని నమ్ముకుని జీవిస్తున్న వేలాది కుటుంబాల స్థితిని ఎండీ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

**సుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవడంలో ఘోరంగా విఫలం**

**దేవరాపల్లి:** గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న విమర్శించారు. ఈ మేరకు దేవరాపల్లిలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో సుగర్ ఫ్యాక్టరీ సమస్యలను ప్రస్తావించి చర్చ జరపడంతో పాటు ఆధునికీకరణకు నిధులు కేటాయించేలా కూటమి నేతలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది రైతులకు పూర్తిగా బకాయిలు చెల్లిస్తారని గ్యారంటీ లేదన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి దాపరించిందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో అన్ని సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి రైతులను ఆదుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎంపీ సి.ఎం.రమేష్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కూటమి నాయకులు నాటకాలు ఆపి రైతు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## 'జూ'మ్మంది ఆనందం








ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు తరలి వచ్చారు. వన్యప్రాణులు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ అలరించాయి. పిల్లలు, పెద్దలు వాటి వద్ద సరదాగా గడిపారు. సింహం, తెల్ల పులులు, నీటి ఏనుగులు, మొసళ్లు ఎన్‌క్లోజర్లలో సందడి చేశాయి. తెల్ల పులులు సందర్శకుల సెల్ఫీలకు పోజులిచ్చాయి. సింహం ఎన్‌క్లోజర్‌లో చెట్టు ఎక్కుతూ, కిందకు జారుతూ అలరించింది. మొసళ్ల కొలనులో ఘరియల్స్ నాచు పారతో కూడిన నీటిలో పైకి తేలుతూ సందర్శకులను ఆకర్షించాయి. -ఆరిలోవ



## చెట్టు నుంచి జారి పడి యువకుడి మృతి

**గొలుగొండ:** మండలంలో సీతకండి గ్రామంలో ఆదివారం చింతచెట్టు నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... జి. మాడుగుల గ్రామానికి చెందిన గిమ్మెలి శేఖర్(29) రెండు రోజులు క్రితం సీతకండి గ్రామంలో తన చిన్నాన్న ఇంటికి వచ్చాడు. ఇక్కడ చిన్నాన్న ఇంటి వద్ద చింతకాయల సేకరణ సమయంలో చెట్టు నుంచి కాలు జారి కింద పడిపోయాడు. దాంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటికే కొన ఊపితో ఉన్న శేఖర్‌ను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## మిల్లెట్ కిసాన్ మేళాకు 'తాండవ' రైతులు



మిల్లెట్ కిసాన్ మేళాకు బయలుదేరిన రైతులు

**పాయకరావుపేట:** భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో చిరుధాన్యాల రైతుల కోసం మిల్లెట్ కిసాన్ మేళా, ఇండస్ట్రీ మీట్ సోమ, మంగళవారాల్లో హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తాండవ రైతు ఉత్పత్తిదారుల సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.వి.వి. సత్యనారాయణ తెలిపారు. ఈ మేళాకు పట్టణానికి చెందిన తాండవ వ్యాలీ ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంఘం నుంచి 40 మంది తరలివెళ్లారు. శాస్త్రీయ సాగు, జీవ వైవిధ్య పరిరక్షణ, పోషకాహార విలువలతో కూడిన చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ లాంటి అంశాల పై అవగాహన కల్పించేందుకు ఈ మేళా ఏర్పాటు చేయడమైనదని ఆయన తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి నాలుగే వేల మంది పాల్గొంటారన్నారు. ఐఐఎంఆర్ డైరెక్టర్ సి.తార సత్యవతి, డాక్టర్ శ్రీనివాస రావు, డాక్టర్ సంగప్ప, ఇతర శాస్త్రవేత్తలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

## 'వినదగునెవ్వరు చెప్పిన..' పుస్తకావిష్కరణ



చాగంటి కోటేశ్వరరావు రచించిన వినదగు నెవ్వరు చెప్పిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య సోమరాజు

**మధురవాడ:** ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థుల నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు రచించిన వినదగునెవ్వరు చెప్పిన పుస్తకాన్ని గాయిత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు ఆదివారం సాయంత్రం మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచన వేదికపై ఆవిష్కరించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం కోసం ఆయన 116 సంచికలుగా రచించిన పుస్తకాన్ని విజయవాడ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఎమెస్కో సంస్థ ముద్రించింది. ప్రథమ ప్రతిని అష్టలక్ష్మి దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ కొనుగోలు చేశారు. కంచి కామకోటి 68వ పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి మహా స్వామి మొదలు మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద, దేవులపల్లి కృష్ణశాస్త్రి, రవీంద్రనాథ్ ఠాగూరు వంటి మహామహులు చెప్పిన పిల్లలకు ఉపయోగపడే అంశాలకు వారు వ్యాఖ్యానాలు చేస్తూ రచించారు. ఎమెస్కో ప్రచురణ సంస్థ అధినేత విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## 23 తులాల బంగారం, రూ.లక్ష చోరీ

**సీతమ్మధార:** ఇంట్లో చొరబడి 23 తులాల బంగా బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ ఘటన మధురానగర్‌లో చోటుచేసుకుంది. మధురానగర్ జీవీఎంసీ పాఠశాల దరి అనంతమాధవి టవర్స్, ఫ్లాట్ నెం.102లో మరకాని కృష్ణ(46) కుటుంబంతో కలిసి ఏడేళ్లుగా నివాసం ఉంటున్నారు. కృష్ణనగరంలోని అశోక్ ఆటోమొబైల్స్‌లో పనిచేస్తున్నారు. శనివారం కుటుంబంతో కలిసి కాకినాడలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి వచ్చేటప్పటికి ఇంటికి వేసి ఉన్న తాళం కట్ చేసి ఉండటాన్ని గమనించారు. దీంతో కంగారుగా ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలో ఉన్న 23 తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితులు ద్వారకా క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బొజ్జన్నకొండపై బాలవికాస్ విద్యార్థుల సందడి



బొజ్జన్నకొండ వద్ద బాలవికాస్ ఆధ్యాత్మిక కార్యక్రమంలో విద్యార్థులు



బొజ్జన్న కొండ వద్ద బాలవికాస్ పిల్లల ఆటలు

**తుమ్మపాల /అనకాపల్లి:** మండలంలోని శంకరంలో బొజ్జన్నకొండ వద్ద ఆదివారం సత్యసాయి బాల వికాస్ ఆధ్యాత్మిక సాధన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ బాలవికాస్ మందిరాల నుంచి 1300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి ఆధ్యాత్మికపరమైన ఆటలు, పాటలు, భజనలు, కోలాటాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బాల వికాస్, లోక వికాస్, సత్య సేవా సమితుల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ బాల్య వికాస్‌తో విద్యార్థులకు ఆధ్యాత్మిక క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. బాల వికాస్ విద్యార్థులకు పెద్దలు, గురువులు పట్ల గౌరవం ఉంటుందన్నారు. సమాజంలో ఎలా నడుచుకోవాలి, ఎలా చదువుకోవాలి, భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలి, వంటి విషయాలు తెలుసుకుంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాల వికాస్‌లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. సత్యసాయి బాల వికాస్‌లలో తర్ఫీదు పొందిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక విభాగ కోఆర్డినేటర్లు శక్తిమూర్తి, వెంకటలక్ష్మి, శంకర్, గురువులు మహేశ్వరి, అరుణ, అనకాపల్లి మందిర కన్వీనర్ రామ్మూర్తి, సాయి కుల్వంత్ కళాశాల కరస్పాండెంట్ కామరాజు పాల్గొన్నారు.

## శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

దేవరాపల్లి పోలీసులకు వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, తదితరులు

**దేవరాపల్లి:** వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముందుగా సంతతోట వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. ఈ నేపథ్యంలోనే దేవరాపల్లి నుంచి వయా సంతతోట మీదుగా చిననందిపల్లి, చేనుల పాలెం, పెదనందిపల్లి కాలనీ వరకు రూ. 2.50 కోట్లతో నిర్మించిన తారురోడ్డును గతేడాది జనవరి 13న ప్రారంభోత్సవం చేశారన్నారు. ఈ శిలాఫలకాన్ని గత నెల 26న రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, కె.ఎం.పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ, వరదపురెడ్డి రమణ, గంగవంశం సంతోష్, రంధి వెంకటరావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల దీక్ష



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి డిపో కండెక్టర్, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని ఎన్ఎంయూఏ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక డిపో ఆవరణలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ శిబిరాన్ని జోనల్ అధ్యక్షుడు వి.ప్రదీప్ ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా విజయనగరం జిల్లా అధ్యక్షుడు దుర్గ రాజు హాజరై మాట్లాడుతూ తక్షణమే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.ఆర్.మూర్తి, ఎం. ఎన్. రావు, ఎం.ఎస్.వాసు, ఆర్.ఎస్.ఆర్.మూర్తి, కె.ఎస్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం, పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ సముదాయంలోని అయ్యప్ప ఆలయ 31వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రధానార్చకుడు ముడియ ప్రసాద్‌శర్మ.. స్వామిని అలంకరించి పూజలు చేశారు. శాస్త్రోక్తంగా హోమం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి కడిమిశెట్టి మాధురి నవీన్ ఆధ్వర్యంలో శ్రీమన్నారాయణీయం పారాయణ కార్యక్రమం జరిపారు.

### లారీకి రూ.60 వేల జరిమానా




అధిక లోడుతో వెళ్తున్న లారీ

అనకాపల్లి: మండలంలో మార్టూరు, బవులవాడ, మామిడిపాలెం గ్రామాల నుంచి రాంబిల్లి మండలానికి అధిక లోడుతో వెళ్తున్న లారీలపై ట్రాఫిక్ పోలీసులు ఆదివారం కఠిన చర్యలకు దిగారు. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బవులవాడ నుంచి రాంబిల్లికి అధిక లోడుతో వెళ్తున్న లారీని సీజ్ చేసి రూ.60 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ఎం .వెంకటనారాయణ తెలిపారు.

### మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల గ్రామంలో ఎటువంటి అనుమతి లేకుండా 11 మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై పట్టణ సీఐ టి.వి. విజయకుమార్ ఆదివారం కేసు నమోదు చేశారు. తుమ్మపాల గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ | : రాజా |
| జాబిలమ్మ నీకు అంత కోపమా | : సత్యనారాయణస్క్రీన్-1(ఉదయం, మ్యాట్నీ) |
| పుష్ప-2 | : సత్యనారాయణస్క్రీన్-1(1,2 షోలు) |
| అగాథియా | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| మజాకా | : పర్తిసాయి |
| సంక్రాంతికి వస్తున్నాం | : షిర్డీసాయి |
| గార్డ్ | : వెంకటేశ్వర |
| తండేల్ | : శ్రీసత్య |
| శబ్దం | : రామచంద్ర |

## రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

## గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 258 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 221 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చు.



కశింకోట-పిసినికాడ రోడ్డు చదును చేస్తున్న రోలర్



సాగుతున్న మదుంల నిర్మాణ పనులు

# ఎట్టకేలకు తారురోడ్డు పనులు




**కశింకోట: ఎట్టకేలకు ఆ గ్రామాల మధ్య తారురోడ్డు పనులకు చకచకా సాగుతున్నాయి. కశింకోట–పిసిని**కాడ(అనకాపల్లి) గ్రామానికి వెళ్లే జాతీయ రహదారిని కలుపుతూ ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా దాదాపు రెండేళ్ల క్రితం మెటల్ రోడ్డును ఏర్పాటు చేశారు. తారు రోడ్డు వేయడానికి ప్రయత్నాలు చేస్తుండగా ఎన్నికల రావడంతో పనులు ముందుకు సాగలేదు. తాజాగా జాతీయ ఉపాధి హామీ నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధి నుంచి దగ్గరి దారిగా దాదాపు కిలోమీటరు పొడవున జాతీయ రహదారిని కలుపుతూ పిసినికాడ గ్రామం వెళ్లడానికిగాను పంట కాలువను ఆనుకొని పొలాల మీదుగా రోడ్డు నిర్మాణం రెండేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు చేపట్టారు. దీనిలో భాగంగా చెట్లు, తుప్పలు తొలగించి చదును చేసి మట్టి, కంకరతో రోడ్డును ఏర్పాటు చేశారు. అనంతరం తారు రోడ్డు వేయడానికి ప్రయత్నాలు జరుగుతుండగా, ఎన్నికలు సమీపించడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. తాజాగా ఉపాధి హామీ నిధులతో సుమారు రూ.50 లక్షలు వెచ్చించి తారు **రోడ్డు నిర్మాణం పనులు ఇటీవల చేపట్టారు. దీనిలో భాగంగా మూడు చోట్ల పంట భూములకు, వర్షపు** నీరు ప్రవహించడానికి అనువుగా మదుంల నిర్మాణం చేపట్టారు. నల్ల పిక్క వేసి రోడ్డును రోలర్, బుల్ డోజర్లతో చదును చేస్తున్నారు. అనంతరం తారు వేసి రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నారు. ఈ రోడ్డు పూర్తయితే కశింకోటలోని ప్రధానంగా గవరపేట, వెదురుపర్తి గ్రామస్తులతో పాటు స్థానికులతో బంధుత్వాలు ఎక్కువగా ఉన్న పిసినికాడ గ్రామస్తులకు, అనకాపల్లి వెళ్లడానికి రోడ్డు దగ్గరి దారిగా ఉపయోగపడనుంది. ఇప్పటి వరకు గ్రామం నుంచి సంతబయల, జాతీయ రహదారి మీదుగా ఆయా గ్రామాలకు చేరుకుంటున్నారు. దీనివల్ల అదనంగా సుమారు రెండు కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఇప్పుడు రోడ్డు నిర్మాణంతో దూరం తగ్గనుంది. అలాగే అదే మార్గంలో అనకాపల్లి చేరుకోవచ్చు. ఈ రోడ్డు రైతులకు కూడా ఉపయోగపడనుంది.

### ఈ రోడ్డుతో అందరికీ మేలు



కశింకోట–పిసినికాడ గ్రామాల మధ్య పంట పొలాల మీదుగా నిర్మిస్తున్న రోడ్డు అందరికీ సౌకర్యవంతంగా ఉండనుంది. రెండు గ్రామాల మధ్య బంధుత్వాలు ఎక్కువగా ఉన్నందున రాకపోకలకు అనువుగా ఉంటుంది. సుమారు రెండు కిలోమీటర్ల దూరం కూడా తగ్గనుంది. తారురోడ్డు నిర్మాణం ఆనందదాయకం.

– మళ్ల త్రిమూర్తులు, పిసినికాడ

### పంట పొలాలకు సులువుగా రాకపోకలు



కశింకోట–పిసినికాడ రోడ్డులో పంట భూములు ఉన్నాయి. ఈ మార్గంలో రోడ్డు నిర్మాణం వల్ల వ్యవసాయ కార్యకలాపాలకు రాకపోకలు సాగించడానికి అనువుగా ఉండనుంది. గతంలో వర్షం పడితే రోడ్డుపై నడవలేని పరిస్థితి. వాహనాలు వెళ్లని పరిస్థితి ఉండేది. ఇప్పుడు రోడ్డు నిర్మాణం పూర్తయితే ఉత్పత్తులు తరలించడానికి సౌకర్యవంతంగా ఉండనుంది. భూములకు విలువ కూడా పెరగనుంది. అనకాపల్లి వెళ్లడానికి దగ్గరి దారి కానుంది.

– చదరం రామారావు, రైతు, కశింకోట

### త్వరగా పనుల పూర్తికి చర్యలు

కశింకోట–పిసినికాడ గ్రామాల మధ్య జాతీయ ఉపాధి హామీ పథకం కింద సుమారు కిలో మీటరు పొడవునా తారు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దీన్ని రూ.50 లక్షలు ఖర్చు చేసి నిర్మిస్తున్నాం. గతంలో రూ.10 లక్షలతో చదును చేసి మెటల్ రోడ్డు ఏర్పాటు చేశారు. తారురోడ్డును త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– వేణుగోపాలరావు, డీఈ, పంచాయతీరాజ్, అనకాపల్లి

## 11న గొర్రెలు, మేకల పెంపకందారుల ధర్నా



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కోన లక్ష్మణ్

అనకాపల్లి: గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి రూ.2500 కోట్లు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న గుంటూరులో సహకార ఫెడరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు మండలంలో మూలపేట గ్రామంలో ఆదివారం ధర్నా వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, మాంసం ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించడంలో నిరంతరం గొర్రెలు, మేకల పెంపకందారులు శ్రమిస్తున్నారని, వీటిపై జిల్లా వ్యాప్తంగా 5 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. తరతరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు పెంపకందారులు అన్ని రకాలుగా వివక్షకు గురౌవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత వైద్య సౌకర్యాలు కల్పించకపోవడంతో జన్మించిన 100 గొర్రె పిల్లల్లో 20 నుంచి 30 శాతం మృత్యువాత పడుతున్నట్లు ఆయన చెప్పారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సకాలంలో వైద్య సౌకర్యాల కల్పనలో విఫలమవుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఈగల అప్పారావు, ఉప్పిలి ఆదినారాయణ, కడుపుట్టల అప్పారావు, అయితా రమణ, నూక అప్పారావు, సీహెచ్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురు పందెంరాయుళ్ల అరెస్ట్

అనకాపల్లి: మండలంలో సత్యనారాయపురం పంచాయతీ శివారున జూదం నాడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ టివి.విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేసి జూదం ఆడుతున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కుమార్ రాజా

అనకాపల్లి టౌన్: పట్టణంలోని లక్ష్మీదేవిపేట పాత్రుడు కాలనీ సంపత్ వినాయక ఆలయం 17వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమార్‌రాజా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేల్పులవీధిలో భద్రావతి సమేత భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవంలో కూడా ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 83వ వార్డు పార్టీ ఇన్‌చార్జ్ జాజుల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు బుద్ధ పెంటారావు, బుద్ధ భాస్కర్‌రావు, పాము సన్నిబాబు, రేబాక స్వామి, కొమ్మాన శంకర్‌రావు, మద్దాల చలపతి, కొంకి శ్రీరామమూర్తి, గ్రరెడ్డి నూకరాజు, కందికొండ సురేష్, లట్టాల మురళీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంజాన్ మాస దీక్షలు ప్రారంభం



కశింకోటలోని నూరి మసీదులో రంజాన్ మాస ప్రారంభ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఉప వాస దీక్ష విరమించిన అనంతరం ఇఫ్తార్ విందు

కశింకోట: కశింకోటలో ముస్లింలు పవిత్ర రంజాన్ మాస దీక్షలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం స్థానిక జామియా, నూరి మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పిల్లలు మొదలుకొని పెద్దల వరకు దీక్ష ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం వరకు ఉపవాసం చేసి సంప్రదాయంగా దీక్ష విరమించారు. అనంతరం ఇఫ్తార్ విందు చేశారు. ఈ నెలాఖరు వరకు రంజాన్ దీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. నూరి మసీదు కమిటీ అధ్యక్షుడు ఎస్.కె.రెహ్మతుల్లా, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఎం అలీ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని నరసింగబిల్లిలో కూడా ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టారు. అక్కడి మసీదులో రంజాన్ మాస ప్రారంభ ప్రార్థనలు చేశారు.

### కోడి పందేల స్థావరంపై దాడి

కోటవురట్ల: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటవురట్ల శివారు గవరపేటలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 3 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. తీర్థాలు పురస్కరించుకుని కోడి పందేలు ఆడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## 'బ్రాండిక్స్‌లో శ్రమ దోపిడీ'



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం బ్రాండిక్స్(అదిస్తాన్) పరిశ్రమ కార్మికులకు యాజమాన్యం తీవ్ర అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్, రవాణా చార్జీలు పోను కార్మికులకు రూ.15వేలు తక్కువ కాకుండా వేతనమివ్వాలని ఆదివారం ఆయన డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు నానాటికీ పెరుగుతున్న తరుణంలో, యాజమాన్యం కోట్లాది రూపాయలు లాభాలు ఆర్జిస్తూ కార్మికులకు భిక్ష వేసుందన్నారు. కార్మికుల జీతాలు పెంచకుండా యాజమాన్యం శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. కార్మికుల మెరుపు సమ్మె సమయంలో వేతనాలు పెంచి, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని యాజమాన్యం ప్రతినిధులు హామీ ఇచ్చి మాట తప్పారని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వ రాయితీలు పొందిన పరిశ్రమ యాజమాన్యం, పని చేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు జీతాలు పెంచి న్యాయం చేయకపోతే, మెరుపు సమ్మెకు దిగుతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

### వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని వినతి



వీఆర్వోల సంఘం ఉపాధ్యక్షుడు శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం వీఆర్వో సంఘం రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షుడు శంకరరావుకు స్థానిక వీఆర్వోలు వినతిపత్రం అందజేశారు. వీఆర్వోలకు గ్రేడ్-1, వీఆర్వో గ్రేడ్-2 లకు కామన్ డీడీవోగా నియమించేలా చూడాలని, సచివాలయానికి ఒక వీఆర్వోను నియమించాలన్నారు. పలు పనులకు సంబంధించి తీవ్ర ఒత్తిడితో ఉద్యోగం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఇందుకు స్పందించిన శంకరరావు మాట్లాడుతూ వీఆర్వోల సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు కె.రమేష్, బీవీ సత్యనారాయణ, ఈఎస్ఎస్ అప్పారావు, పి.హిమబిందు, సురేష్, అశోక్, మురళి, దేవి, జయకృష్ణ, కోటి, కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎవరెక్స్ పరిశ్రమలో ప్రమాదంపై విచారణ



ఎవరెక్స్ పరిశ్రమలో ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్న సీఐ నరసింగరావు

రాంబిల్లి(యలమంచిలి): లాలం కోడూరులోని ఎస్ఈజెడ్‌లో ఉన్న ఎవరెక్స్ డ్రగ్స్ పరిశ్రమలో శనివారం జరిగిన ప్రమాదంపై రాంబిల్లి సీఐ సిహెచ్.నరసింగరావు ఆదివారం విచారణ చేపట్టారు. పరిశ్రమలోకి వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ లోపల బాయిలర్ వద్ద రసాయనాలు మిక్సింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగిందా? మరే ఇతర కారణాలు వల్ల జరిగిందా? అని ఆరా తీశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



సమావేశమైన గవరపాలెం చిన్న హైస్కూల్ 1968-69 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అనకాపల్లి: ఏరా మిత్రమా.. బాగున్నావా.. ఏం చేస్తున్నావు.. నీలో ఎంత మార్పు వచ్చిందిరా.. అంటూ స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్ 1968–69 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ పలకరింపులతో ఆ ప్రాంతం సందడిగా కనిపించింది. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం పట్టణంలో జార్జ్‌క్లబ్ ఆవరణలో ఆదివారం జరిగింది. హైస్కూల్ పదో తరగతి మొదటి బ్యాచ్ 56 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశం ఎంతో ఉత్సాహంగా సాగింది. 70 సంవత్సరాలు పైబడిన వారందరూ ఒకచోట కలవడం ఆనందంగా ఉందని రేలంగి సూర్యప్రకాశరావు(హైదరాబాద్) అన్నారు. 35 మంది పూర్వ విద్యార్థులు ఒక చోట కలుసుకుని ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, పూర్వ విద్యార్థులు డాక్టర్ ఎం.బి.బి.స్వామి, పడాల గణపతిరావు, బొల్లాప్రగడ కన్నాజీరావు, బుద్ధ వీరునాయుడు, కె.ఎం.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీ కమిటీ అధ్యక్షుడిగా శివాజీ



సమావేశమైన జగనన్న కాలనీ కమిటీ సభ్యులు

అనకాపల్లి: మండలంలో సంపతిపురం పంచాయతీ శివారు జగనన్న కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా బొడ్డేడ శివాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీలో ఆదివారం జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడిగా పడాల జగదీష్, కార్యదర్శిగా షేక్ మదీనాబాబు, కమిటీ సభ్యులుగా కరణం కిరణ్, జీవన్‌కుమార్, జాన్సర్, ఎలిశెట్టి పార్వతి, సంతోష్, మణి, శంకరరావు, దిలీప్, మున్నా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శివాజీ మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## విద్యతోనే మహిళలకు భవిష్యత్తు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న అనకాపల్లి 10వ అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీవిద్య

కశింకోట: బాలికలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించడానికి కృషి చేయాలని అనకాపల్లి 10వ అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీవిద్య కోరారు. తాళ్లపాలెం ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం బాలికలకు చట్టాలు, కెరీర్ అభివృద్ధి, ఇతర అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల భవిష్యత్తుకు విద్య ప్రధానంగా దోహదపడుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో దీటుగా రాణిస్తున్నారని చెప్పారు. పోక్సో, ఇతర మహిళా రక్షణ చట్టాల గురించి, గుడ్, బ్యాడ్ టచ్‌ల పట్ల అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు ఎలా మసలుకోవాలి, అపరిచితుల నుంచి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. గ్రేస్, ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వెంకన్న కల్యాణం



నరసింగబిల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న దంపతులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు అర్చకుడు వెలమూరి రమేష్‌బాబు, వేద పండితుడు గోరుగంతుల భాస్కరరావుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ పలువురు దంపతులు కల్యాణం జరిపించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ యువజన విభాగం నాయకుడు మలసాల కుమార్‌రాజా, తదితరులు ఆలయంలో స్వామిని దర్శించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేవారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, చింతలపాలెం గ్రామాల్లో ఊరేగించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, సర్పంచ్‌లు కోన అరుణ, కొట్టె రాము, ఎంపీటీసీ సభ్యుడు షేక్ దర్గా, పాల సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి కన్నయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి నిరంజన్‌కుమార్, ఉత్సవ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత సాధించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ఎం.శ్రావణి

తుమ్మపాల: మహిళా సాధికారత సాధించాలని డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత వారోత్సవాలను ఆదివారం బొజ్జన్నకొండ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళగా కుటుంబ బాధ్యతలతో పాటు విధి నిర్వహణలో పూర్తి శ్రద్ధతో పనిచేస్తున్న మహిళా పోలీసులను అభినందిస్తున్నట్లు చెప్పారు. మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి అవసరమైన పలు అంశాలను తెలియజేశారు. అంతకు ముందు చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, స్వామినాయుడు, వెంకటనారాయణ, ఎస్ఐలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాములమ్మ, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## టాలెంట్ పరీక్షలతో ఆత్మవిశ్వాసం



గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి టాలెంట్ టెస్టులు దోహదపడతాయని గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయం ఆవరణలో పోటీ పరీక్షల శిక్షణ కేంద్రం నిర్వాహకుడు శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏపీ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్‌కు టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు, టాలెంట్ పరీక్షల్లో రాణించాలన్నారు.